www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 5 డిసెంబర్ 2025

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్

కోనసీమ

కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ ఎంపిడిఒ వెలిచేటి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో మూడంచెల సచివాలయ వ్యవస్థ పై పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయసిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి మండల స్థాయిలో మండల జిఎస్డబ్ల్యూఎస్ ఆఫీసర్‌గా, జిల్లా స్థాయిలో జిల్లా జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి సమక్షంలో సచివాలయాలు పని చేస్తాయని అన్నారు. శాఖాపరమైన పనులతో పాటు జనరల్ సర్వేలు ఎప్పటికప్పుడు సిబ్బంది సకాలంలో పూర్తి చేయాలన్నారు.సచివాలయ సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా హాజరు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సాయిబాబా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఆశలన్నీ సీలేరు పైనే..!

- రబీకి తప్పని సాగునీటి కష్టాలు
- 93.26 టిఎంసిల సాగునీరు అవసరం
- అందుబాటులో 73.36 టిఎంసిలే
- 19.90 టిఎంసిల కొరత
- నీటి పొదుపు చర్యలపై అధికారుల దృష్టి

ఈ ఏడాది రబీ సాగులో రైతులకు సాగునీటి కష్టాలు తప్పేటట్లు లేవు. గోదావరిలో సాగునీటి లభ్యత ఆందోళనకరంగా ఉంది. ఎన్నడూ లేని విధంగా డిసెంబర్ నెలలోనే గోదావరిలో ఇసుక మేటలు బయట పడ్డాయి. ధవళేశ్వరం ఆనకట్టకు ఎగువ భాగంలో భారీగా ఇసుక మేటలు పేరు కుపోయాయి. ఆనకట్టకు కేవలం 500 మీటర్ల దూరంలోనే నదిలో పలుచోట్ల రెండు మూడు అడుగులు లోతు మాత్రమే నీరు ఉంది. కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెన వద్ద పూర్తిగా నీరు తగ్గిపోవడంతో గోదావరిలో ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. ఇటువైపు నుంచి అవతలి వడ్డు వరకు నడిచి వెళ్లిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.



కాటన్ బ్యారేజీ ఎగువన గోదావరి నదిలో కనిపిస్తున్న ఇసుక మేటలు

ప్రజాశక్తి - కొవ్వూరు

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో గోదావరి డెల్టా ఆయకట్టులో 8,96,507 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని అధికారులు లెక్కలు వేశారు. ఈ సీజన్‌లో సాగునీటి అవసరాల నిమిత్తం 86.04 టిఎంసిలు, పరిశ్రమలు, తాగునీటి అవసరాల నిమిత్తం 7.22 టిఎంసిల నీరు అవసరమని అధికారులు లెక్కలు వేశారు. ఈ రబీ సీజన్‌లో మొత్తం 93.26 టిఎంసిల నీరు అవసరమని జల వనరుల శాఖ అధికారులు తేల్చారు.

19.90 టిఎంసిల కొరత

ఏడాది రవి సీజన్లో గోదావరిలో సహజ జలాల రూపంలో 9.45 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని అంచనా వేశారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా 20 టిఎంసిల నీరు, సీలేరు జలాశయం ద్వారా 43.91 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని లెక్కలు వేశారు. మొత్తం 73.36 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని లెక్కలు వేశారు. ఈ లెక్కన 19.90 టిఎంసిల నీరు రబీ సీజన్‌లో కొరత ఉంటుందని అంచనా వేశారు.

సీలేరు జలాలే దిక్కు

సీలేరు నుంచి రోజుకి 4,200 క్యూసెక్కుల చొప్పున సాగు నీరు అందుతుందని జలవనుల శాఖ అధికారులు చెబుతున్నారు.



సీలేరు రిజర్వాయర్

రబీ సీజన్ గోదావరి నీటి లభ్యత వివరాలు

గోదావరి డెల్టా ఆయకట్టు	: 8,96,507 ఎకరాలు
రబీలో అవసరమైన సాగునీరు	: 86.04 టిఎంసిలు
తాగునీరు, పరిశ్రమలు అవసరమైన నీరు	: 7.22 టిఎంసిలు
మొత్తం రబీకి అవసరమైన నీరు	: 93.26 టిఎంసిలు
గోదారిలో సహజ జలాల ద్వారా	: 9.45 టిఎంసిలు
పోలవరం ప్రాజెక్టు నుంచి	: 20 టిఎంసిలు
సీలేరు ద్వారా లభ్యమయ్యే సాగునీరు	: 43.91 టిఎంసిలు
ఇంకా అవసరమైన నీరు	:19.90 టిఎంసిలు

43.91 టిఎంసిల నీటిని గోదావరి డెల్టాకు విడుదల చేసేందుకు అంగీకరించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో సీలేరు జలాశయానికి సుమారు 70 టిఎంసిలు నీరు అందుబాటులో ఉండొచ్చని అంచనా వేశారు. రబీ సీజన్‌లో కొరత వచ్చే జలాలను సీలేరు ద్వారా సర్దుబాటు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. రెండు నెలల పాటు సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ఉండే పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీటి సరఫరా చేసే డొంకరాయి పవర్ కెనాల్‌కు నీటి సరఫరా రెండు నెలలపాటు నిలిపివేస్తున్నట్లు ఎపి జెన్‌కో ఛీఫ్ ఇంజినీర్ కెవి.రాజారావు ప్రకటించారు. దీంతో రానున్న రెండు నెలలు సీలేరు నుంచి అనుకున్న స్థాయిలో నీరు వచ్చే అవకాశం కన్పించడం లేదు. సీజన్ ప్రారంభంలోనే గోదావరిలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

నీటి పొదుపు చర్యలే శరణ్యం

ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతుల పంటలు గొట్టెక్కాలంటే నీటి పొదుపు చర్యలే శరణ్యమని అధికారులు భావిస్తున్నారు. పలుచోట్ల మురుగు కాలువలకు అడ్డుకట్టలు, ఆయిల్ ఇంజన్ల సాయంతో శివారు ప్రాంతాలకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. కోనసీమ జిల్లా పరిధిలోని సెంట్రల్ డెల్టాకు సాగునీటి కష్టాలు తీర్చేందుకు రూ.2.5 కోట్ల తో అధికారులు ప్రతిపాదన పంపారు. ఏలూరు జిల్లా పరిధిలో పశ్చిమ డెల్టా కాలువ నీటి పొదుపు జల్లు నిమిత్తం రూ.56,199 ప్రతిపాదనలు పంపారు. పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో పశ్చిమ డెల్టా కాలువకు రూ.2 కోట్లతో ప్రతిపాదన పంపించారు. వీటికి తోడు నీటి పొదుపు చర్యలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిమిత్తం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలోని మూడు డెల్టాలకు 610 తాత్కాలిక లస్కర్లను నియమించారు.



గోదావరి తూర్పు డెల్టా కాలువకు విడుదలవుతున్న నీరు

నీటి పొదుపు చర్యలు పాటించాలి

రబీ సీజన్‌లో గోదావరి డెల్టా ఆయకట్టు రైతులు నీటి పొదుపు చర్యలు పాటించాలి. సెంట్రల్ డెల్టాకు నీటి పొదుపు చర్యలు నిమిత్తం రూ.2.5 కోట్ల అంచనాతో ప్రతిపాదన పంపించాం. వీటితో ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు, మురుగు కాలువలకు అడ్డుకట్టలు తదితర పనులు చేపడతాం. రబీ పంట గట్టెక్కాలంటే 19.90 టిఎంసిల నీరు అదనంగా అవసరం ఉంది. సీలేరులో ఎగువ ప్రాజెక్టులతో కలిపి 70 టిఎంసిలు వరకు నీరు అందుబాటులో ఉంటుందని అంచనా. దీనిలో 43.91 టిఎంసిలు సీలేరు నుంచి ఇచ్చేందుకు అంగీకరించారు. నీటి కొరతకు ఆస్కారం లేకుండా సీలేరు ద్వారా అవసరమైన నీటిని తీసుకునేందుకు చర్యలు తీసుకుంటాం.

-కె.గోపీనాథ్, ఎస్ఇ, గోదావరి హెడ్ వర్క్స్, ధవళేశ్వరం



గడియార స్తంభం సెంటర్లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

పెంచలయ్య హత్యకు నిరసన

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- గంజాయి మాఫియాను అరికట్టాలి
- ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

నెల్లూరులో ప్రజానాట్య మండలి నాయకుడు కె.పెంచలయ్యపై గంజాయి మాఫియా దాడి చేసి దారుణంగా హత్య చేయడంపై ప్రజా సంఘాలు నిరసన తెలిపాయి. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం, అనంతరం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పెంచలయ్యకి మృతికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పెంచలయ్యని దారుణంగా హత్య చేసిన నిందితులందరినీ అరెస్టు చేసి, చట్టం ప్రకారం శిక్షించాలన్నారు. పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. మృతుడు పెంచలయ్య కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలన్నారు. వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి తగిన పరిహారం ప్రకటించి, కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విజృంభిస్తున్న గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల మాఫియాను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అన్నారు. పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు గంజాయి, డ్రగ్స్ వ్యాపారం చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, దాడులకు పాల్పడుతున్న వారిని అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీస్‌శాఖ గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. ఇటు వంటి దారుణాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఇటువంటి దారుణమైన హత్యలు, దాడులు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడటానికి శాంతిభద్రతల విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ మాఫియా పెరగడం వలన యువత జీవితాలు నాశనమవుతున్నాయని అన్నారు. సామాన్య ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను తక్షణమే నెరవేర్చకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, మాల మహానాడు జిల్లా నాయకులు గిట్ల వెంకటేశ్వరరావు, సాపే రమేష్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జి.దైవకృప, నాయకురాలు జి.మరి యమ్మ, బిఎస్‌పి అమలాపురం నియోజకవర్గ ఇంచార్జ్ వాకపల్లి హరీష్‌కుమార్, దళితసేన జిల్లా అధ్యక్షులు డేవిడ్ అంబేద్కర్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఎం.వెంక టేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ నాయకులు కె.శంకర్, వివిధ ప్రజా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి దాతల విరాళాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో నిత్యాన్నదానానికి దాతలు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలకు స్వామి వార్ల దర్శనం చేయించారు. అనంతరం దాతలకు స్వామి వారి చిత్ర పటాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. **ఆత్రేయపురం**: వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికొచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహించేందుకు గురువారం కొత్తపల్లికి చెందిన మద్దాల వెంకట మురళి గోపాలకృష్ణ, నాగదుర్గ వేణి, వారి కుటుంబ సభ్యులు రూ.25,116 అందజేశారని ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్ రావు తెలియజేశారు. అలాగే తణుకు చెందిన జొన్నలగడ్డ శ్రీ రామచంద్రమూర్తి, బాల త్రిపుర సుందరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.25,001 నిత్యాన్నదానానికి అందజేశారని ఆలయ డిసి తెలియజేశారు. దాతలకు స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం వారి తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటా లను అందజేశారు. **మామిడికుదురు:** ఉప్పలగుప్తంకు చెందిన చిక్కం నాగేశ్వరరావు, మణి సరోజిని దేవి దంపతులు, వారి కుటుంబ సభ్యులు గురువారం మండలంలోని అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి అన్న ప్రసాద ట్రస్ట్‌కు రూ10,116 విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్య నారాయణ రాజు ఈసందర్భంగా తెలిపారు. వీరికి బాలబాలాజీ స్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీ నారాయణ(చక్రి) స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

పునర్విభజనతో డివిజన్ కనుమరుగు

- స్పందించని మంత్రి సుభాష్
- వైసిపి నేతల ఆరోపణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

కూటమి ప్రభుత్వం చేస్తున్న జిల్లాల పునర్విభజనతో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కనుమరుగు అయ్యే అవకాశలు కనిపిస్తున్నాయని వైసిపి ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. దీనిపై స్థానిక మంత్రి సుభాష్ స్పందించడం లేదని ఆరోపించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి గురువారం సూర్యప్రకాష్ విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రపురం డివిజన్‌ను యథాతథంగా ఉండే ప్రయత్నం కూడా చేయకుండా మంత్రి వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటన్నారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లా కలిపేలా టిడిపికి చెందిన ఎంఎల్‌ఎ సఫలీకృతమయ్యారన్నారు. ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే మంత్రి మండలిలో ఉన్న మంత్రి సుభాష్ రెవెన్యూ డివిజన్‌ను కాపాడటంతో ఎందుకు నోరు మెద పటంలేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఆయన అభిప్రాయాన్ని ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు చెప్పకుండా మౌనంగా ఉండటం దారుణమని విమర్శించారు. రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాలు రాజమండ్రి డివిజన్‌లో విలీనం అయితే రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కేవలం రెండు మండలాలకే పరిమితం అవుతుందన్నారు. దీంతో రెవెన్యూ డివిజన్‌ను కూడా ఎత్తివేసే పరిస్థితి వస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కేవలం గెజిట్ నోటిఫికేషన్‌ను మాత్రమే విడుదలచేసిందన్నారు. ఈనెల 30 వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్న సమయంలో ప్రజల తరుపున ప్రతిపక్ష హోదాలో వైసిపి పోరాటం చేస్తుందన్నారు. రెవెన్యూ డివిజన్‌ను కాపాడేందుకు ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి విన్నివించేందుకు వినతులు స్వీకరిస్తామన్నారు. అందులో భాగంగా ఈనెల 12న పట్టణంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా వైఎస్ఆర్ విగ్రహం వద్ద ప్రజల వద్ద నుంచి సంతకాల సేకరణ నిర్వహిస్తామన్నారు. దీనికి మేధావులు, ప్రజలు, రైతులు, విద్యార్థు లు మద్దతును తెలపాలని కోరారు. సమావేశంలో జెడ్‌పిటిసి వనుము సుబ్బారావు, మండల కన్వీనర్లు పోలినాటి వరప్రసాద్, పెట్టా శ్రీనివాస్, పిల్లి కృష్ణమూర్తి, పట్టణ కన్వీనర్ గాదం శెట్టి శ్రీధర్ మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఎంపిపిలు అంబటి భవానీ , పంపన నాగమణి సుబ్బారావు, వైస్ ఎంపిపి శాఖా బాబి, వాసంశెట్టి శ్యామ్, సర్పంచులు ఎల్లమెల్లి సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి సూర్యప్రకాష్

రైతులకు నష్టపరిహారం అందించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

తుపానులు, వర్షాలు కారణంగా నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం అందించాలని మాజీ ఎంపీ చింతా అనురాధ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సన్నవిల్లిలో గురువారం ఆమె పర్యటించారు. పంట పొలాలను కళ్లాల్లోని తడిసిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ అనురాధ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏ పంటకు గిట్టుబాటు ధర కల్పించని కూటమి ప్రభుత్వం అన్నదాతలకు సంకటంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా కళ్లాల్లోని ధాన్యం రైతుల కళ్లల్లో దైన్యం తప్ప కనిపించడం లేదని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రోత్సహి స్తున్నది రైతన్నా మీకోసం కార్యక్రమం కాదని.. అది రైతన్నను మోసం చేసే కార్యక్రమం అని విమర్శిం చారు. రైతులు లేకుండా అధికార పార్టీ కార్యకర్తలకే రైతులుగా పచ్చ కండువాలు కప్పి ప్రచారం కోసం రూ.కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వంలో ధాన్యానికి మద్దతు ధరతో పాటు సంచులు రవాణా ఖర్చులు కూడా అందించి అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకుందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ధాన్యం బస్తాకు రూ.1770 చెల్లించాల్సి ఉండగా చంద్రబాబు ప్రభుత్వం రైతులను దళారుల పాలు చేసిందని అన్నారు. రైతులు రూ.1200కు దళారులకు అమ్ముకుం టున్నారని అన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అన్నదాతలు వ్యవసాయానికి దూర మయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని పంటకు మద్దతు ధర కల్పించడంతోపాటు రానున్న సీజన్‌లో విత్తనాలు ఎరువులు కొరత లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు,స్థానిక ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజకుమారి, వైసిపి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల హనుమంత శ్రీనివాసరావు, వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షుడు ఓగూరి విజయ్ కుమార్, నాయకులు మోటూరి సత్యం కాపు,చిక్కం నాగబాబు, నక్కా చిన్న తదితరులు ఉన్నారు.



ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ అనురాధ



హర్షం వ్యక్తంచేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మండపేట విలీనంపై హర్షం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట నియోజక వర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడంపై గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల రెవెన్యూ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కపిలేశ్వరపురం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మండపేట నియోజకవర్గ ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేసేందుకు ఎంఎల్‌ఎ వేగుళ్ల ఎన్నికల హామీకి కట్టుబడి పనిచేసి విజయం సాధించడం పట్ల ఆయనకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.శ్రీనివాస్, మండల విఆర్ ఒలు, విఆర్‌ఎలు తదితరులు, పాల్గొన్నారు.



డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం

ద్రాక్షారామంలో డిఎల్‌డిఒ కార్యాలయం ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని ద్రాక్షారామం గ్రామ పంచాయతీ వద్ద నిర్మించిన డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయాన్ని గురువారం డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ భవన నిర్మాణానికి రూ.43 లక్షలు మంజూరు చేశారు. దీనికి తోడు జడ్‌పి నిధులు మరో రూ.10లక్షలు కేటాయించి భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డివిజనల్ అభివృద్ధి అధికారి వి.విజయలక్ష్మి, ఎంపిపి అంబటి భవాని, మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర, సర్పంచ్ కె.అరుణ, కూటమి నాయకులు, కంచుమర్తి బాబురావు, ఎంపిటిసి శాఖ బాబి, ద్రాక్షారామ ఉప సర్పంచ్ బుచ్చిరాజు, పలు మండల అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



చందన బ్రదర్స్‌లో వినియోగదారులకు సిద్ధంగా ఉంచిన బహుమతులు

చందన బ్రదర్స్‌లో వార్షికోత్సవ సేల్

ప్రతీ రూ.వెయ్యి కొనుగోలుపై స్పాట్ గిఫ్ట్

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం సినిమా రోడ్డులో ఉన్న చందనబ్రదర్స్‌లో 25వ వార్షికోత్సవ సేల్ ప్రారంభమైందని యాజమాన్యం తెలిపింది. ప్రతి రూ.1000 కొనుగోలుపై స్పాట్ గిఫ్ట్ పేరుతో కొనుగోలుదారులకు వెంటనే బహుమతులు అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారులకు ప్రతి వెరైటీపై 50 శాతం, ఒకటి కొంటే ఒకటి ఉచితం ఇలా పలు రకాల ఆఫర్స్ ఇస్తున్నామన్నారు. మహిళలు, పురుషులు, పిల్లలకు సంబంధించి పలు రకాల దుస్తులు అందరికీ అందుబాటు ధరల్లో అందిస్తున్నామన్నారు.ఫ్రాక్స్, బాబా సూట్స్, చుడీదార్స్‌పై ఎవరూ ఊహించని రీతిలో 70 శాతం డిస్కౌంట్ ధరలతో అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఫర్నిచింగ్, ఫుట్‌వేర్, 1 గ్రామ్ గోల్డ్ జ్యుయవెలరీపై 50 శాతం తగ్గింపు ధరలు అమల్లో ఉన్నాయన్నారు. అన్ని రకాల క్రెడిట్ కార్డ్స్ స్వీకరించబడతాయని, ఈ అవకాశం డిసెంబర్ 1వ తేదీ నుంచి 15 తేదీ వరకు ఉంటుందని, అమలాపురం చుట్టు పక్కల వినియో గదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని యాజమాన్యం తెలిపింది.



అంగర పిహెచ్‌సి ని తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి సత్యనారాయణ

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.సత్యనారాయణ వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు . గురువారం కపిలేశ్వరపురం మండలం పరిధి అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓపి రిజిస్ట్రేషన్, ఇన్ పేషెంట్ వార్డు, లేబర్ రూమ్, లాబరేటరీ, ఫార్మసీ, వ్యాక్సిన్ స్టోరేజ్ రూమ్, తదితర విభాగాలను పరిశీలించి చేశారు. అలాగే ఇహెచ్ఆర్ చేసే విధానాన్ని పరిశీలించారు. తనిఖీలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, డాక్టర్ జె.అనూజా ప్రియాంక ఉన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.రత్నకుమారి, వైద్య సిబ్బంది ఉన్నారు.

కంటి వైద్య పరీక్షలు పునఃప్రారంభం

అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గురువారం కంటి వైద్య పరీక్షలు పునఃప్రారంభమయ్యాయి. ఇకపై ప్రతీ గురువారం పిహెచ్‌సిలో ఆఫ్తాలమిక్ ఆఫీసర్ ఎస్‌వివి.సత్యనారాయణ ద్వారా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని వైద్యాధికారి డా.పి.రత్నకుమారి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు, హెల్త్‌విజిటర్ టి.మేరీ మణి, హెల్త్ సూపర్‌వైజర్ యమ్.నానిబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పుల్లేటికుర్రు మార్కెట్ ప్రాంతంలో పరిశీలిస్తున్న ఎంపిపి, ఎంపిడిఓ, సర్పంచ్

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - అంబాజీపేట


ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. పరిసరాలలో మురుగునీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉండవచ్చునని ఆయన అన్నారు. పుల్లేటికుర్రు మార్కెట్ ఏరియాలో దొమ్మేటి సురేష్‌కి డెంగీ పాజిటివ్ రావడంతో అమలాపురం ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ జల్లి బాలరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి డి.లక్ష్మీపతి శానిటేషన్ చేయించి మురుగుగుంటల్లో ఎబిట్ స్ప్రే చేయించి డ్రెయినేజీలు క్లీన్ చేయించి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ పనులను ఎంపిపితో పాటు ఎంపిడిఒ బి.మమత, డిప్యూటీ ఎంపిడిఒ కె.శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, శానిటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు వీరబ్రహ్మాంకు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రానికి చెందిన గుత్తుల వీరబ్రహ్మాం ఆల్ ఎపి బిసి , ఒబిసి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణంరాంబాబు గురువారం వీరబ్రహ్మాం పనిచేసే స్కూల్ వద్ద కలుసుకుని అభినందించారు. ఉపాధ్యాయుడిని సత్కరించారు. ప్రస్తుతం గుత్తుల వీరబ్రహ్మాం మోడల్ ప్రైమరీ స్కూల్ చొప్పెల్ల నందు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

అదృశ్యమైన బాలిక మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన మల్లి సాత్విక (10) సోమవారం సాయంత్రం అదృశ్యం అయింది. ఆ రోజు నుంచి ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఎంతకూ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామంలో ఉన్న రావిచెట్టు రేవులో ఆ బాలిక మృతదేహం ఉన్నట్లు గురువారం స్థానికులు గుర్తించారు. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

పుల్లలపాడుకు చెందిన ఆరేపల్లి సోమరాజు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుల్లలపాడు గ్రామానికి చెందిన సోమరాజు పామాయిల్ గెలలు కోసేందుకు ప్రకాశరావుపాలెం గ్రామ రైతు గద్దె సత్యనారాయణకు కూలికి వెళ్లాడు. గెలలు కోస్తూ ఉండగా విద్యుత్తు వైర్లకు ఐరన్ పైపునకు ఉన్న కత్తి తగలడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆంజనేయస్వామి ఆలయంలో బంగారం వస్తువులు, వెండి ఆభరణాల చోరీపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కట్టుంగ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 2వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులు పగలగొట్టి స్వామి వారి వెండి ఆభరణాలు, బంగారు వస్తువులు దొంగిలించారు. దీనిపై ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతి

ప్రజాశక్తి - రాజానగరం

ప్రేమ వివాహం చేసుకున్న ఏడాదిన్నరకే రోడ్డు ప్రమాదంలో అశువులు బాశారు. రాజానగరం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందగా, వారికి జన్మించిన మూడు నెలల చిన్నారి అనాథగా మారింది.

మండలంలో నందరాడకు చెందిన జుత్తుక లిలాప్రసాద్(21), బొమ్మూరు బర్మా కాలనీ చెందిన సురేష్ సోమియా(20) ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీళ్లకు మూడు నెలల ఆడపిల్ల పుట్టింది. గురువారం మధ్యాహ్నం మోటారు సైకిల్‌పై రాజానగరం బ్యాంకు నుంచి ఇంటికి వెళుతుండగా జాతీయ రహదారి మధ్యలో నరేంద్రపురం సెంటర్లో కుడివైపు ఆగి ఉన్నారు. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెలుతున్న సిమెంట్ లోడ్ లారీ ఎడమవైపు ద్విచక్రవాహనాన్ని తప్పించే ప్రయత్నంలో రోడ్డుకు కుడివైపు ఆగివున్న ఈ దంపతులను ఢీకొట్టింది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఎడమవైపు స్కూటీపై వెళ్తున్న గాదరాడకు చెందిన బొడ్డు వెంకటలక్ష్మి, సొమ్మంగి వీరలక్ష్మి గాయాలపాలయ్యారు. వీరిని 108లో ఆసుపత్రికి తరలించారు. మతదేహాలను పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలుని అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట గోలివారి వీధికి చెందిన బాలుడు ఏనాపు జగదీష్ గురువారం అమ్మమ్మ శేషరత్నంతో కలిసి స్టేషన్ సెంటర్ రింగ్ సెంటర్‌లోని సాయిబాబా ఆలయానికి వెళ్లాడు. జగదీశ్ అక్కడి నుంచి కనిపించకుండా పోవడంతో అమ్మమ్మ, తల్లి శ్రీదేవి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ, సిబ్బంది స్పందించి చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అనంతరం భీమేశ్వరాలయం వద్ద బాలుడు జగదీష్‌ను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి బాలుని సురక్షితంగా గుర్తించిన పోలీసు సిబ్బందిని ఎస్‌పి జి.బిందు మాధవ్, డిఎస్‌పి శ్రీహరి రాజు అభినందించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గుర్రంపాలెంలో గురువారం పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ రఘునాథరావు, సిబ్బంది పేకాడుతున్న వారిని అదులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జరిమానా, జైలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఆరుగురికి రూ.60 వేల జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ అధికారిని కలిసిన జివి.రావు

ప్రజాశక్తి - రామచంద్రపురం

డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ అధికారి కె.చంద్రశేఖరబాబును గురువారం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ బాబును జివి.రావు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించి రాష్ట్రంలో జిల్లాను అత్యుత్తమ స్థానంలో ఉంచాలని సూచించారు.ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ లో ప్రతి సంవత్సరం జిఆర్‌సి మోడరన్ జూనియర్ కాలేజి సాధిస్తున్న ఉత్తమ ఫలితాలను జివి.రావు చంద్రశేఖర్ బాబుకు వివరించారు. ఈ విద్యా సంవత్సరం కూడా అత్యుత్తమ ఫలితాల సాధనకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు రావు వివరించారు. మరిన్ని మంచి ఫలితాలు సాధించాలని చంద్రశేఖర్ బాబు ఆకాంక్షించారు.

మండాలమ్మపేటలో సమస్యల తిష్ట

▸ మట్టితో కూడిన తాగునీటి సరఫరా ▸ పారిశుధ్యం అధ్వానం

ప్రజాశక్తి - రామచంద్రపురం



మట్టి తో సరఫరా అవుతున్న మంచినీరు



డ్రైయినేజీ వద్ద పేనుకుపోయిన చెత్త

మండలంలోని ద్రాక్షారామం గ్రామపంచాయతీ పరిధిలోగల మండాలమ్మపేట దళితవాడలో సమస్యలు తిష్ట వేశాయి. గ్రామంలో తాగునీరు నల్లగా మట్టితో కూడి సరఫరా అవుతోంని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం గురువారం సరఫరా అయిన మంచి నీరు తాగేందుకు పనికి రాకపోవడంతో ఇక్కట్లకు గురవుతున్నామని వారు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని డ్రెయినేజీలు పూడుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. దీంతో ఈగలు దోమలు వృద్ధి చెంది అనారోగ్య సమస్యలు బారిన పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్త తొలగించకపోవడంతో వీధులన్నీ అపరిశుభ్రంగా తయారయ్యాయన్నారు. ఇక్కడ గల పూసల వారి కాలనీలో పరిస్థితి కూడా ఇలాగే ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించి మంచినీటి సమస్య పరిష్కరించాలని, పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలని, డ్రెయినేజీలు శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లించాలని, గ్రామంలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లేకుంటే పలు సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ కార్యదర్శి వివరణ

దీనిపై ద్రాక్షారామం గ్రామ కార్యదర్శి పెట్టా సత్య నారాయణను వివరణ కోరగా పంచాయతీ నుండి సరఫరా అయ్యే మంచినీటి ట్యాంకును రెండు రోజుల క్రితం శుభ్రం చేశామన్నారు. దానిలో మిగిలిపోయిన నీరు బయటకు వెళ్లకపోవడంతో తాగునీరు నల్లగా వచ్చిందన్నారు. అవుట్ లెట్ శుభ్రపరిచి మంచినీళ్ల సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తమ వద్ద 25 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారని వర్షం కారణంగా రెండు రోజులు పాటు చెత్తను శుభ్రం చేయలేదన్నారు. వీలైనంత త్వరలో శుభ్రపరిచేందుకు చర్యలు చేపడతామని 'ప్రజాశక్తి'కి వివరించారు.

సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థిని బయటికి

గురుకుల పాఠశాల వద్ద బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కాకినాడ జిల్లా తుని ఘటన మరువక ముందే అదే తరహాలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మరో ఘటన వెలుగు చూసింది. సిబ్బంది నిర్లక్ష్యంతో ఠానేలంక అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బంధువులమంటూ వచ్చిన ఇద్దరు బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటనలో సెక్యూరిటీ నుంచి ప్రిన్సిపల్ వరకూ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనపడుతుంది. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు గురుకులం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై ప్రిన్సిపల్ డిడి.శారద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పదో తరగతి చదువుతున్న బాలిక తల్లి ఉపాధి నిమిత్తం దుబాయ్, తండ్రి ఇతర రాష్ట్రంలో ఉంటున్నారు. నాయనమ్మ వద్ద ఉంటూ ముమ్మిడివరం గురుకుల పాఠశాలలో చదువుకుంటోంది. బుధవారం పాఠశాలకు బాలిక బంధువులమంటూ మహిళతో పాటు ఒక వ్యక్తి వచ్చారు. విద్యార్థిని నాయనమ్మకు ఆరోగ్యం బాగాలేదని, ఒకసారి తీసుకెళ్తామంటూ ప్రిన్సిపల్‌ను అడిగారు. దానికి ఆమె ససేమీరా అన్నారు. దీంతో వారు ఎవరికో ఫోన్ చేశారు. బాలిక నాయనమ్మ అంటూ మాట్లాడించి ప్రిన్సిపల్‌ను నమ్మించారు. ఆసుపత్రికి తీసుకెళ్లి వచ్చేస్తామని చెప్పి బాలికను వెంటబెట్టుకెళ్లారు. రాత్రయినా బాలిక రాకపోవడంతో, విద్యార్థిని నాయనమ్మకు గురుకులం సిబ్బంది ఫోన్ చేశారు. బంధువులు ఎవర్నీ పంపలేదని ఆమె సమాధానం ఇవ్వడంతో బాలిక అదృశ్యమైనట్టు గుర్తించారు. వెంటనే ప్రిన్సిపల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను తీసుకెళ్లిన వారు కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన మోకా గిరిబాబు(35), నేతల అర్చనగా గుర్తించారు. బాలికను, నిందితుడు గిరిబాబు, సహకరించిన మహిళ అర్చను పోలీసులు అమలాపురంలోని ఓ లాడ్జిలో పట్టుకున్నారు. అమలాపురం డిఎస్‌పి టిఎస్‌కె.ప్రసాద్ వారిని విచారిస్తున్నారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించామని సిఐ తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యార్థిని నాయనమ్మ, బంధువులు గురుకుల పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. తాము తమ పిల్లల వద్దకు వెళ్లాలంటే అనేక ఆంక్షలు పెడుతున్నారని, అటువంటిది బయట వ్యక్తులతో తమ పిల్లలను ఎలా పంపిస్తున్నారని ప్రశ్నించారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్, సెక్యూరిటీ సిబ్బందిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఎల్ఐసి ఎఒఐ వార్షికోత్సవం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్



సీనియర్ నాయకులకు స్వాగతం పలుకుతున్న యూనియన్ నేతలు

ఎల్ఐసి ఎఒఐ మొదటి వార్షికోత్సవం గురువారం అమలాపురం మేథా గార్డెన్స్‌లో యూనియన్ ప్రస్తుత ప్రెసిడెంట్ సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజమండ్రి సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ కె.వెంకటేశ్వర్లు, డివిజన్ సేల్స్ మేనేజర్ ఎన్ఎస్ఎస్ శర్మ పాల్గొన్నారు. ఎస్‌డిఎం మాట్లాడుతూ డివిజన్లో అత్యధిక పాలసీలు చేసిన అమలాపురం బ్రాంచ్ మొదటి స్థానంలో నిలబెట్టిన ఏజెంట్స్, ఆఫీస్ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ప్రస్తుత ప్రెసిడెంట్‌గా ఉన్న వీరభద్రరావు డివిజన్ ప్రెసిడెంట్‌గా, ఆయన స్థానంలో అయినవిల్లి నాగేంద్ర కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉన్న అయినవిల్లి నాగేంద్ర కుమార్ బ్రాంచ్ ప్రెసిడెంట్ గా ఎన్నిక కావటంతో ఆయన స్థానంలో కేత వీరస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారు బాధ్యతలు స్వీకరించారు. గత నెల అత్యధిక పాలసీలు చేసిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఐసి సౌత్ సెంట్రల్ జోన్ నాయకులు పిఎల్. నరసింహారావు, ఎల్ఐసి ఎఒఐ స్టేట్ ప్రధాన కార్యదర్శి జి.రవికిషోర్, అంబాజీపేట సాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ బివియన్.రవీంద్రకుమార్, అమలాపురం అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కె.వెంకట మధుబాబు, బ్రాంచ్ సీనియర్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎస్.రాజేంద్ర, ఎస్ఎస్.నాయుడు, ఎన్.సుబ్రహ్మణ్యం, బ్రాంచ్ ఆఫీస్ ఎంప్లాయిస్ యూనియన్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

రబీ సాగుకు డ్రెయిన్లలో సాగునీరు వృధాగా కాపోకుండా రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేటలో గురువారం రబీ సాగుకు నీటిఎద్దడి సమస్యకు సంబంధించి ఇరిగేషన్, వ్యవసాయ శాఖ,నీటి సంఘాలు, రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. మూసుకుపోయిన పంట కాలువలు, తూడు,రుప్పలు తొలగించి చర్యలు చేపట్టాలని రైతులు విన్నవించారు. సాగునీటి వినియోగంపై సంబంధిత అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. ఇసుకపూడి, పసుపల్లి, కె.పెదపూడి నీటి సంఘం అధ్యక్షులు కొల్లాడ సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అక్కిశెట్టి శివ ప్రసాద్, తహశీల్దారు చినబాబు, ఎంపిడిఒ బి.మమత, ఎఒ కె.ధర్మ ప్రసాద్, ఇరిగేషన్ జెఇ, ఆర్ఐ ఏడుకొండలు,విఆర్ఓలు, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా సత్తిబాబు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ శ్రీ ఉమా మల్లేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ గా దమ్ము సత్యనారాయణ(సత్తిబాబు), ప్రమాణస్వీకారం చేశారు. కార్యవర్గ సభ్యులుగా యేళ్ళ సుహాసిని, చిటికిన మంజు, పడాల ఈశ్వరీ దేవి, సుంకర రాజేష్, జొన్నాడ శ్రీనివాస్, బిక్కవోలు అనంతలక్ష్మి, బుర్ర వెంకటరమణ, మల్లిడి రేణుక, ఎక్స్ అఫీషియో సభ్యునిగా కాళ్లకూరి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇఓ నరేంద్ర కుమార్ వారితో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, నామాల సూరిబాబు, సొసైటీ ఛైర్మన్ మేడపాటి రామారెడ్డి, గొడవర్తి బాబి, చింతలపూడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స కోసం రమణారావు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అమలాపురం



రూ.10 వేలు అందజేస్తున్న రమణారావు

కొమరగిరిపట్నం కొత్త కాలనీ కు చెందిన వికలాంగుడు నెల్లి ఏడుకొండలు రోడ్డు ప్రమాదానికి గురై అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏడుకొండలుకు చికిత్స అందించేందుకు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులను అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నేత, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన రమణారావు బుధవారం ఏడుకొండలు చికిత్స నిమిత్తం రూ.10 వేలు సాయం అందించారు. రమణారావు కు ఏడుకొండలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సాధనాల శ్రీను, నక్క సంపత్ కుమార్, చింతా సూరిబాబు, నాగవరపు పరశురాముడు ,నేరేడుమిల్లి శ్రీనివాసరావు, గంటా లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - మామిడికుదురు



సమావేశంలో మాట్లాడుతున్న కళ్యాణ్ బాబు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి ఎస్‌టియు కృషి చేస్తుందని నిలుస్తుందని జిల్లా అధ్యక్షులు పోతంశెట్టి దొరబాబు పేర్కొన్నారు. మామిడికుదురు హై స్కూల్ నందు మండల ఎస్‌టియు శాఖ అధ్యక్షులు కారుపల్లి కళ్యాణ బాబు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. మండల శాఖ ఉపాధ్యాయులకు చేస్తున్న సేవలను కొనియాడారు విశిష్ట అతిథులుగా ఎంఇఒలు లక్ష్మీ నారాయణ, మోకా వెంకన్నబాబు లు పాల్గొని జిల్లా అవార్డు గ్రహీతలకు,పెద్దలకు, కార్యక్రమానికి సహకరించిన దాతలకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో వివిధ హై స్కూల్స్ హెచ్ఎలు బి.చిరంజీవి, కొండేపూడి హరినాథ్, గాడేపల్లి నాగప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్య పళ్ళంరాజు, జిల్లా ఆర్థిక కార్యదర్శి నేరేడుమెల్లి సత్యనారాయణ , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నాగిరెడ్డి శివప్రసాద్ , రాష్ట్ర కన్వీనర్ మట్టా నాగరాజు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి కొమ్ముల వీరరాఘవ రావు, ఆర్థిక కార్యదర్శి సయ్యద్ రజి, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు మండల అధ్యక్షునిగా రవికుమార్

ఎన్నికల పరిశీలకులు తోట బాలకృష్ణ ఆధ్వర్యంలో మండల శాఖ నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. మండల శాఖ ఎస్‌టియు అధ్యక్షునిగా చిక్కం రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా నేల వెంకటేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి కొట్నాల కిరణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికఅయ్యారు. వారికి మండలశాఖ ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.



పాల్గొన్న కలెక్టర్, ఎంఎల్ఏ తదితరులు

అంతర్వేది ఉత్సవాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవాల సందర్భంగా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం అంతర్వేది ఆలయం వద్ద జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ అంతర్వేది స్వామివారి కల్యాణోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు విచ్చేస్తారన్నారు. దీని కనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రాజోలు ఎంఎల్ఏ దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం నోటిఫైడ్ ఫెస్టివల్‌గా అంతర్వేది స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ ఉత్సవాలను రాష్ట్ర పండగగా జరిపేందుకు ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. అంతర్వేది కళ్యాణోత్సవాలు జనవరి 25 నుంచి ఫిబ్రవరి2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సమావేశంలో ఆలయ ఛైర్మన్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహదూర్, ఎస్‌పి రాహుల్ మీనా, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఉత్సవ అధికారి డిఎల్‌వి రమేష్ బాబు, జిల్లా దేవదాయ శాఖ అధికారి వి.సత్యనారాయణ,జెసి టి.నిషాంతి, అమలాపురం ఆర్‌డిఒ కె. మాధవి, ఆలయ ఎసి ప్రసాద్, ఎంపిపి వీరా మల్లిబాబు, సర్పంచ్ జాన్ బాబు, వివిధ శాఖల జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని గురువారం కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన గెల్లి వెంకట నాగ చక్రధరరావు కుటుంబ సమేతంగా దర్శించికుని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి నిత్యాన్నదాన నిధికి రూ.25,116 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సత్యనారాయణ రాజు తెలిపారు వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటం బహూకరించారు.

వర్చువల్‌గా డిఎల్‌డిఒ కార్యాలయాన్ని ప్రారంభించిన డిప్యూటి సిఎం

ప్రజాశక్తి - కొత్తపేట

పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జెడ్‌పి సాధారణ నిధులు రూ.22లక్షలతో నిర్మించిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని గురువారం డిప్యూటి సిఎం కె.పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు బండారు సంజీవ్, కొత్తపేట జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ డిఎల్‌డిఒ కార్యాలయాన్ని డిప్యూటి సిఎంచే ప్రారంభించుకోవడం సంతోషకరమని అన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి వేగవంతమైందని అన్నారు. అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎమ్.గంగాధర్‌రావు, పాలూరి సత్యానందరావు, కంఠం శెట్టి శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు

కోరంగిలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా పరిధికి చెందిన తాళ్లరేవు మండలం కోరంగి గ్రామంలో విమానాశ్రయ ఏర్పాటు కొరకు తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడును కోరినట్లు ఎంపీ గంటి హరీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విమాన ప్రయాణికుల కోసం వాటి సర్వీసులు, టిక్కెట్ ధరల పై దృష్టి సారించాలని మంత్రికి సూచించారని ఎంపీ అన్నారు.

పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

మెగా పేరెంట్ టీచర్స్ మీట్ ఘనంగా నిర్వహించాలని సిఎంఒ సుబ్రహ్మణ్యం సూచించారు. నగరం హైస్కూల్‌ను గురువారం సందర్శించారు. శుక్రవారం నిర్వహిస్తున్న మెగా పేటిఎం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అందరికీ ఆహ్వానాలు పంపించారా లేదా అన్న అంశం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఇఒ మోకా వెంకన్నబాబు, హైస్కూల్ హెచ్ఎం శ్రీదేవి పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** మండలంలోని వల్లూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆత్మీయ సమావేశం విజయవంతం చేయాలని పాఠశాల హెచ్ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు మెగా పేరెంట్స్ సమావేశానికి తల్లిదండ్రులను, గ్రామ పెద్దలను, ఆహ్వానిస్తూ ఉపాధ్యాయులు ఆహ్వాన పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల రామ తులసి, తదితరులు పాల్గొన్నారు

క్విజ్ పోటీల్లో ముక్తేశ్వరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అయినవిల్లి

అమలాపురంలో జిల్లా స్థాయిలో జరిగిన రిలయన్స్ ధీరుభాయ్ అంబానీ క్విజ్ పోటీల్లో అయినవిల్లి మండలం ముక్తేశ్వరం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఐదో స్థానం సాధించి ప్రతిభ చాటారు. విద్యార్థులు బొక్కా యశ్విన్, యల్లమెల్లి జానకిరామ్ జిల్లా బాలికా శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి ఎమ్‌వికె.భీమారావు, రిలయన్స్ మేనేజింగ్ డైరక్టర్ల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, సైకిళ్ల బహుమతిగా పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పలువురు అభినందించారు. **మండపేట:** రాజమహేంద్రవరం లో ఇటీవల జరిగిన రిలయన్స్ క్విజ్ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన మండపేట మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినిలను ఎంఎల్ఏ వేగుళ్ళ జోగేశ్వరరావు అభినందించారు. విద్యార్థినిలు యువిఎన్ఎస్.ప్రజ్ఞ, కె.దివ్య ధనలక్ష్మికి రూ.53 వేలు విలువ గల రెండు ల్యాప్‌టాప్‌లను టిడిపి కార్యాలయంలో గురువారం ఎంఎల్ఏ వేగుళ్ళ విద్యార్థినిలకు అందజేశారు.

డిమాండ్లపై క్లస్టర్ మొబైల్ టీచర్ల వినతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండల విద్యాశాఖ నందు పనిచేయుచున్న క్లస్టర్ మొబైల్ టీచర్స్ అంతా కలిసి తమ న్యాయమైన డిమాండ్ల కొరకు తహశీల్దార్ ప్రకాష్ బాబు, ఎంపిడిఒ ఎ.రాజు, ఎంఇఒ అప్పాజీలకు గురువారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మా జెఎసి యూనియన్ పిలుపుమేరకు మా డిమాండ్లను నెరవేర్చాలంటూ ప్రత్యేకంగా రిప్రెజెంటేషన్ అందజేశామని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. ఉన్నతాధికారులకు తెలియజేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సిఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సిఆర్‌పిల నిరసన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

తమ సమస్యలు పరిష్కరించాలని సిఆర్‌పిలు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ 2011లో స్కూల్ కాంప్లెక్స్ లో సిఆర్‌పిలుగా ఎంపికై 14 సంవత్సరాలుగా పాఠశాల విద్యాశాఖ సమగ్రశిక్షలో సిఆర్‌ఎంటి లుగా పనిచేస్తున్నామన్నారు. స్కూల్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం సృష్టించిన పోస్టులను ఎ, బి క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించాలన్నారు. 9 సంవత్సరాలుగా ఏవిధమైన వేతన పెంపుదల లేకుండా 2016లో ఆమోదించిన రూ.23,500 వేతనాలుగా చెల్లిస్తున్నందున పెరిగిన అధిక ధరలతో కుటుంబ పోషణ కష్టతరంగా ఉందనాఉ. తక్షణమే వేతనాలు పెంపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మండపేట

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అభివృద్ధిని సాధించాలని ఎంఎల్ఏ వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. గురువారం మండపేట శ్రీగౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్ ల్యాబ్)ను ఎంఎల్ఏ వేగుళ్ల ప్రారంభించారు.